
తెలుగు దినపత్రిక
# డైలీ రిపోర్ట్
DAILY REPORT




సంపుటి: 1 సంచిక: 133 పేజీలు: 4 ఎడిటర్ : బక్క రవీందర్ ప్రచురణ: హైదరాబాద్ గురువారం 12 -12-2024 వెల: 5/రూ -





# మంచు ఫ్యామిలీలో మంటలు!

## హైదరాబాద్‌లో నటుడు మోహన్‌బాబు ఇంటి వద్ద రోజంతా హైడ్రామా, ఉద్రిక్తత

### ఉదయం 'మంచు టౌన్' నుంచి సోదరుడు మనోజ్ దంపతులను

- బలవంతంగా బయటకు పంపించిన మంచు విష్ణు
- న్యాయం చేయాలంటూ పోలీసు ఉన్నతాధికారులను ఆశ్రయించిన మనోజ్, మౌనిక
- సాయంత్రం మరోసారి ఇంటికి.. 7 నెలల కుమార్తెను అప్పగించాలని డిమాండ్
- అడ్డుకున్న సెక్యూరిటీ.. బలవంతంగా లోనికి చొచ్చుకెళ్లిన మనోజ్
- చిన్నకొడుకు తీరును తప్పుబడుతూ ఆడియో విడుదల చేసిన మోహన్‌బాబు
- ఆపై గేటు వద్ద మీడియా ప్రతినిధిపై మోహన్‌బాబు దాడి
- కాలికి గాయం అవడంతో ఆయన్ను ఆస్పత్రికి తీసుకెళ్లిన విష్ణు
- తాజా పరిణామాలపై తండ్రీకొడుకులకు రాచకొండ సీపీ నోటీసులు
- నేడు రూ. లక్ష చొప్పున పూచీకత్తుతోపాటు ముగ్గురి తుపాకుల అప్పగింతకు ఆదేశం

**సీనియర్ నటుడు మంచు మోహన్‌బాబు కుటుంబంలో గొడవలు మంగళవారం తారస్థాయికి చేరాయి. హైదరాబాద్ జల్‌పల్లిలోని మోహన్‌బాబు నివాసం 'మంచు టౌన్'వద్ద ఉదయం నుంచి రాత్రి వరకు హైడ్రామా నడిచింది. ఓవైపు పోలీసులు, మరోవైపు వ్యక్తిగత బౌన్సర్ల మోహరింపు.. తోపులాటలు.. దూషణలు.. మీడియా ప్రతినిధులపై దాడితో అక్కడ తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు చోటుచేసుకున్నాయి.విష్ణు ఇన్... మనోజ్ ఔట్...**

హైదరాబాద్: దుబాయ్ నుంచి 'మంచు టౌన్'కు తిరిగి వచ్చిన మోహన్‌బాబు పెద్ద కుమారుడు విష్ణు తొలుత తన సోదరుడు మనోజ్‌తో ఇటీవలి పరిణామాలపై చర్చించారు. అయితే ఆ చర్చలు సఫలం కాకపోవడంతో ఇంటిని ఆధీనంలోకి తీసుకొని మనోజ్, ఆయన భార్య మౌనిక, వారి సిబ్బంది, బౌన్సర్లను బలవంతంగా బయటకు పంపించేశారు. ఈ నేపథ్యంలో ఆయా బౌన్సర్ల మధ్య వాగ్వాదం, తోపులాట, ఘర్షణలు జరిగాయి. ఆ ఇల్లు మోహన్‌బాబు పేరిట ఉండటంతో అక్కడ ఉన్న పోలీసులు ఏమీ చేయలేకపోయారు.తనపై దాడి జరిగిందని లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసినా తనకు రక్షణ కల్పించకుండా పహాడీషరీఫ్ పోలీసులు ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని మంచు మనోజ్ మీడియాతో మాట్లాడుతూ ఆరోపించారు. జజస్త్రజస్త్ర



## భూబదిలీ కాగానే వరంగల్ ఎయిర్‌పోర్ట్ పనులు

- 2026 జూన్ నాటికి ఏపీలోని భోగాపురం విమానాశ్రయం సిద్ధం
- త్వరలో దేశవ్యాప్తంగా మరో 50 విమానాశ్రయాలు: కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు
- శంషాబాద్‌లో ఏఐ ఆధారిత ఎయిర్‌పోర్టు ప్రిడిక్టివ్ ఆపరేషన్ సెంటర్ ప్రారంభం

మిగతా 2,7లో



## ఎమ్మెల్యేకు ప్రజలు దూరం కావడానికి కారణం పీఏలు, పీఆర్వోలే

హైదరాబాద్: శాసనసభ అంటే అందరిదీ.. ఏ ఒక్క పార్టీకి చెందినది కాదన్నారు మంత్రి శ్రీధర్ బాబు. కొత్తగా శాసనసభకు ఎన్నికైన నేతలందరూ సభకు హాజరయ్యే సంప్రదాయం కొనసాగించాలని కోరారు. సిద్ధాంతపరంగా బేధాలున్నప్పటికీ..

## ఓట్లను తొలగిస్తున్నారు



### ఈసీకి ఆప్ ఫిర్యాదు

న్యూఢిల్లీ: ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల ముందు బీజేపీ కుట్రపూరితంగా ఓట్లను పెద్ద సంఖ్యలో తొలగిస్తోందని అరవింద్ కేజ్రీవాల్ సారథ్యంలో ఆప్ ప్రతినిధి బృందం బుధవారం ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసింది.



మిగతా 2లో

## నీ ద్రోహ చరిత్ర చెరిగిపోదు కేసీఆర్ కీర్తి తొలగిపోదు

- మిలియన్ మార్చ్‌లో ఉన్నవా, సాగరహారంలో ఉన్నవా?
- ఒక్కరోజైనా ఉద్యమంలో పాల్గొన్నవా రేవంత్?
- ఎవరి దయాదాక్షిణ్యాలతోనో తెలంగాణ రాలేదు
- కేసీఆర్ పోరాటం వల్లే రాష్ట్రం వచ్చింది
- కేసీఆర్ దీక్ష లేకుంటే రాష్ట్రం ఏర్పడేదే కాదు
- డిసెంబర్ 9న చిదంబరం ప్రకటనను
- తెలంగాణకు నంబర్‌వన్ విలన్ కాంగ్రెస్సే!
- నిప్పులు చెరిగిన మాజీమంత్రి హరీశ్‌రావు

సంగారెడ్డి,: తెలంగాణ ఉద్యమం గురించి రేవంత్‌రెడ్డి మాట్లాడుతుంటే దయ్యాలు వేదాలు వల్లించినట్టు ఉన్నదని మండిపడ్డారు. తెలంగాణ ఉద్యమ చరిత్ర రాస్తే రేవంత్‌రెడ్డి ద్రోహ చరిత ఉంటుందని, ఉద్యమానికి రేవంత్ ఎలా ద్రోహం చేశాడో చరితలో నిక్షిప్తమవుతుందని ధ్వజమెత్తారు. 'ఎప్పటికైనా నీ ద్రోహ చరిత్ర మలిగిపోదు..తెలంగాణ సాధకుడిగా కేసీఆర్ కీర్తి తొలగిపోదు.. ఈ విషయాన్ని రేవంత్‌రెడ్డి గుర్తించుకోవాలె' అని హెచ్చరించారు.

## బీజేపీ ఎంపీల వ్యాఖ్యలను తొలగించండి

- బీజేపీ ఎంపీల వ్యాఖ్యలను తొలగించండి
- సభ సజావుగా జరిగేలా చర్యలు తీసుకోండి
- లోక్‌సభ స్పీకర్‌కు ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ విజ్ఞప్తి

న్యూఢిల్లీ, డిసెంబరు 11: కాంగ్రెస్–సోరోస్ అంశంలో తనని అవమానించేలా బీజేపీ ఎంపీలు సభలో చేసిన వ్యాఖ్యలను రికార్డుల నుంచి తొలగించాలని లోక్‌సభలో ప్రతిపక్ష నేత, ఎంపీ రాహుల్ గాంధీ లోక్‌సభ స్పీకర్‌ను కోరారు. ఈ మేరకు లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాను బుధవారం



## కలెక్టర్ల సమర్థతతోనే ప్రజలకు న్యాయం

- వైసీపీ పాలనలో అన్ని శాఖలూ నిర్వీర్యం
- వచ్చే రెండేళ్ల నిధులూ ముందే వాడేశారు
- ఇప్పుడిప్పుడే చీకట్లు తొలగిపోతున్నాయి
- ఆరు నెలల్లోనే పెట్టుబడులు వస్తున్నాయి
- సంక్రాంతి నాటికి గోతులు లేని రోడ్లు
- 'రెవెన్యూ' ఫిర్యాదులు పరిష్కరించాల్సిందే
- 15 శాతం జీఎస్‌డీపీ వృద్ధిరేటే లక్ష్యం
- కలెక్టర్ల సదస్సులో చంద్రబాబు స్పష్టీకరణ



# నీ ద్రోహ చరిత్ర చెరిగిపోదు కేసీఆర్ కీర్తి తొలగిపోదు



బుధవారం సంగారెడ్డిలో హరీశ్ పర్యటించారు. అనారోగ్యంతో బాధపడుతున్న మాజీ ఎమ్మెల్సీ ఆర్.సత్యనారాయణను పరామర్శించారు. అనంతరం సంగారెడ్డి కలెక్టరేట్‌లో తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాలవేశారు. అమరుల స్తూపం వద్ద ఎమ్మెల్యే చింతా ప్రభాకర్, బీఆర్ఎస్ నాయకులతో కలిసి నివాళులర్పించారు. తర్వాత ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ క్యాంపు కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి ఏఒక్కరోజు కూడా జై తెలంగాణ అనలేదని, అమరులకు నివాళులర్పించలేదని, ఉద్యమంలో పదవులకు రాజీనామా చేయాలని జేఏసీ చైర్మన్ కోదండరామ్ కోరితే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయకుండా రేవంత్‌రెడ్డి వెన్నుచూపి పారిపోయాడని గుర్తుచేశారు. కేసీఆర్ ఆమరణదీక్ష ఫలితంగానే తెలంగాణ ఏర్పడిందని, ఎవరి దయాదాక్షిణ్యాలతోనో రాలేదని స్పష్టంచేశారు. కేసీఆర్ దీక్ష చేపట్టిన నవంబర్ 29 లేకుంటే డిసెంబర్ 9 ప్రకటన లేదని, డిసెంబర్ 9న ప్రకటన లేకుంటే జూన్ 2న తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు లేదని తేల్చిచెప్పారు. కొందరు తెలంగాణ చరిత్రను మార్చే వెకిలి మకిలి ప్రయత్నాలు చేస్తున్నారని, అవి కల్లలుగా మిగిలిపోతాయని హెచ్చరించారు.

**ఉద్యమకారులపై తుపాకీ ఎక్కుపెట్టినవ్**

ఉద్యమకారులపైకి తుపాకీ ఎక్కుపెట్టిన ద్రోహ చరిత్ర రేవంత్‌రెడ్డిదని హరీశ్ మండిపడ్డారు. నాడు టీడీపీ ఎమ్మెల్యేగా ఉన్న రేవంత్‌రెడ్డి జై తెలంగాణ అనలేదని, రెండు కండ్ల సిద్ధాంతి చంద్రబాబును ప్రజలు నిలదీస్తుంటే ఆయన కోసం రైఫిల్ పట్టుకొని బయలుదేరిన వ్యక్తి రేవంత్‌రెడ్డి అని ఆగ్రహం వ్యక్తంచేశారు. వంటావార్పు, రహదారుల దిగ్బంధం, రైలురోకో, మిలియన్ మార్చ్, సకల జనుల సమ్మె, సాగరహారం ఇలా ఏ కార్యక్రమంలోనూ రేవంత్‌రెడ్డి పాల్గొనలేదని స్పష్టంచేశారు. నాడు సోనియాను బలిదేవత అన్న రేవంత్‌రెడ్డి, ఇప్పుడు సోనియాను దేవత అనడం విడ్డూరంగా ఉన్నదని దెప్పిపొడిచారు. 'అధికారం ఉన్నది కదా అని మిడిసిపడుతూ నువ్వు చెప్పిందే చరిత్ర అనుకుంటున్నవ్.. నీ ద్రోహ చరిత్ర చెరిగిపోయేది కాదు' అని హెచ్చరించారు. 'తెలంగాణ తల్లి విగ్రహాన్ని మార్చి మేమే రాష్ట్రాన్ని తెచ్చినం అని రేవంత్‌రెడ్డి మాట్లాడితే విశ్వసించేంత అమాయకులు కాదు ప్రజలు!' అని తేల్చిచెప్పారు. తెలంగాణ తల్లి విగ్రహాన్ని అధికారికంగా ఎక్కడా పెట్టలేదని రేవంత్‌రెడ్డి చెప్పటంపై మండిపడ్డారు. 2015, జూన్ 2న సంగారెడ్డి కలెక్టరేట్‌లో అధికారికంగా తెలంగాణ తల్లి విగ్రహాన్ని మంత్రి హోదాలో తానే ఆవిష్కరించానని గుర్తుచేశారు.

కార్యక్రమంలో తనతోపాటు అప్పటి ఎమ్మెల్యేలు బాబూమోహన్, చింతాప్రభాకర్, మదన్‌రెడ్డి, కలెక్టర్ రాహుల్ బొజ్జా పాల్గొన్నారని తెలిపారు. నాడు విగ్రహాన్ని ఆవిష్కరించినందుకు గుర్తుగానే ఈ రోజు కలెక్టరేట్‌లో తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించినట్టు చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున అధికారికంగా తెలంగాణ తల్లి విగ్రహాన్ని కలెక్టరేట్లలో, గ్రామాల్లో, విదేశాల్లో కూడా పెట్టామని, అలాంటి విగ్రహాలను తొలగిస్తావా? అని రేవంత్‌రెడ్డిపై ధ్వజమెత్తారు. కేసీఆర్ సైతం 2023, జూన్ 22న అమరుల స్మారక చిహ్నాన్ని ప్రారంభించిన రోజు తెలంగాణ తల్లి కాంస్య విగ్రహాన్ని కూడా స్మారక చిహ్నంలో పెట్టారని గుర్తుచేశారు. తెలుగుతల్లి, కర్ణాటకతల్లి, తమిళతల్లి, భారతమాతను ఏ ప్రభుత్వాలూ మార్చలేదని, రేవంత్‌రెడ్డి మాత్రం తెలంగాణ తల్లి విగ్రహాన్ని మార్చటం సిగ్గుచేటని మండిపడ్డారు. మాయమాటలతో ప్రజలను మధ్యపెట్టి అధికారంలోకి వచ్చిన రేవంత్‌రెడ్డి, రైతుబంధు, దళితబంధు, బీసీబంధు, కేసీఆర్ కిట్లు, బతుకమ్మ చీరలను బంద్ పెట్టి అన్ని వర్గాల వారిని మోసం చేశారని ధ్వజమెత్తారు. గురుకులాల్లో 49 విద్యార్థులు మరణించారని, వందలాది మంది అనారోగ్యం పాలయ్యారని ఆవేదన వ్యక్తంచేశారు. 'తెలంగాణ తల్లి విగ్రహాన్నో, టీఎస్‌ను టీజీ అనో మార్చటం కాదు.. దమ్ముంటే తెలంగాణ ప్రజల బతుకులు మార్చు' అని సవాల్ చేశారు.తెలంగాణకు నంబర్ వన్ ద్రోహి కాంగ్రెస్ పార్టీ అని హరీశ్ ధ్వజమెత్తారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షలను అడుగడుగునా కాలరాసిన చరిత్ర కాంగ్రెస్ సొంతమని నిప్పులు చెరిగారు. ఉద్యమాన్ని అణచివేసి, ఎంతోమంది ఉద్యమకారుల ప్రాణాలను బలిగొన్నదని, ఆంధ్రా నాయకుల లాబీయింగ్‌కు తలొగ్గి ఉన్న తెలంగాణను కూడా ఆంధ్రాలో కలిపిందని ఫైర్ అయ్యారు.

# మంచు ఫ్యామిలీలో మంటలు!

తాను ఆస్తి, డబ్బు కోసం పోరాటం చేయట్లేదని.. ఆత్మగౌరవం, భార్యాపిల్లల రక్షణ కోసం పోరాడుతున్నానన్నారు. ఈ విషయంలో న్యాయం కోసం ప్రపంచంలో ఎవరినైనా కలుస్తానంటూ వ్యాఖ్యానించారు. అనంతరం శాంతిభద్రతల అదనపు డీజీ మహేష్ భగవత్‌తోపాటు ఇంటెలిజెన్స్ డీజీ బి. శివధర్‌రెడ్డిని సతీసమేతంగా వెళ్లి వేర్వేరుగా కలిశారు. తనకు అన్యాయం జరుగుతోందని.. న్యాయం చేయాలని.. రక్షణ కల్పించాలని కోరారు. మరోవైపు సోమవారం మనోజ్, మోహన్‌బాబు ఇచ్చిన పరస్పర ఫిర్యాదులపై వేర్వేరు కేసులు నమోదు చేసిన పహాడీ షరీఫ్ పోలీసులు దర్యాప్తు కోసం 'మంచు టౌన్'కు వెళ్లారు. మోహన్‌బాబు నుంచి వాంగ్మూలం నమోదు చేశారు. మోహన్‌బాబు, విష్ణు తమ అనుచరులతో కలిసి మనోజ్ దంపతుల సామగ్రిని బయటకు తరలించడానికి రెండు వాహనాలను సిద్ధం చేశారు. ఈ విషయం తెలుసుకున్న మనోజ్, మౌనిక తిరిగి 'మంచు టౌన్'కు వెళ్లారు. అయితే సెక్యూరిటీ సిబ్బంది గేట్లు తెరవకపోవడంతో తన ఏడు నెలల పాప ఇంట్లో ఉందంటూ వారితో మనోజ్ వాగ్వాదానికి దిగారు. బలవంతంగా గేట్లు తెరుచుకుని లోపలకు వెళ్లారు. ఈ నేపథ్యంలో రాచకొండ పోలీసులు మంచు టౌన్ వద్ద అదనపు బలగాలను మోహరించారు. అక్కడి నుంచి బౌన్సర్లను బయటకు పంపారు. ఈలోగా మోహన్‌బాబు తన చిన్నకుమారుడి తీరును ఆక్షేపిస్తూ ఆడియో సందేశాన్ని విడుదల చేశారు. అనంతరం గేటు బయటకు వచ్చి అక్కడున్న మీడియా ప్రతినిధులపై ఆగ్రహంతో ఊగిపోయారు. ఓ ప్రతినిధిపై దాడికి పాల్పడ్డారు. దాడిని ఖండించిన జర్నలిస్టులు.. మోహన్‌బాబు క్షమాపణ చెప్పాలంటూ అక్కడే ధర్నా చేశారు. మరోవైపు మోహన్‌బాబు కాలికి గాయం కావడంతో విష్ణు ఆయన్ను గచ్చి'చిలిలోని కాంటినెంటల్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఈ ఉదంతంలో గాయపడ్డ జర్నలిస్టును పోలీసులు శంషాబాద్‌లోని ఓ ఆస్పత్రికి తరలించారు. కాగా, టీవీ9 విలేకరి రంజిత్ ఫిర్యాదు మేరకు మోహన్‌బాబుపై పహాడీషరీఫ్ పోలీసులు కేసు నమోదు చేశారు. మోహన్‌బాబు, ఆయన కుమారులను బుధవారం ఉదయం 10:30 గంటలకు స్వయంగా తన ఎదుటహాజరుకావాలని రాచకొండ సీపీ స్యుదీర్‌బాబు నోటీసులు జారీ చేశారు. అలాగే ముగ్గురి తుపాకులతోపాటు రూ. లక్ష చొప్పున పూచికత్తు సమర్పించాలని ఆదేశించారు.

# భూబదిలీ కాగానే వరంగల్ ఎయిర్‌పోర్ట్ పనులు

(మొదటి పేజీ తరువాయి)

హైదరాబాద్: వరంగల్‌లో విమానాశ్రయానికి అదనంగా కావాల్సిన 250 ఎకరాల భూమి భారత ఎయిర్‌పోర్ట్ అథారిటీకి బదిలీ కాగానే నిర్మాణ పనులు ప్రారంభిస్తామని కేంద్ర పౌర విమానయానశాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడు చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం ఆ ప్రక్రియను వేగంగానే నిర్వహిస్తుందని ఆశిస్తున్నామన్నారు. బుధవారం మధ్యాహ్నం శంషాబాద్‌లోని రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో కొత్తగా ఏర్పాటు చేసిన నెక్ట్స్ జనరేషన్ ఎయిర్‌పోర్టు ప్రిడిక్టివ్ ఆపరేషన్ సెంటర్‌ను ఆయన ప్రారంభించారు. నంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు మాట్లాడారు. రాష్ట్రంలో కొత్తగా ప్రతిపాదించిన విమానాశ్రయాల్లో తొలుత వరంగల్ విమానాశ్రయ ఏర్పాటుకు చర్యలు ప్రారంభించినట్టు పేర్కొన్నారు. ఏపీలోని భోగాపురం విమానాశ్రయాన్ని 2026 జూన్ నాటికి పూర్తి చేసే లక్ష్యంతో పనిచేస్తున్నామని చెప్పారు. దేశవ్యాప్తంగా విమానాశ్రయాల్లో బాంబులు పెట్టామంటూ కాల్స్ చేస్తున్న ఘటనలు తీవ్రమైన నేపథ్యంలో, అలాంటి ఫోన్‌కాల్స్ చేసే వారిపై కఠిన చర్యలు తీసుకునేలా చట్ట సవరణ చేయనున్నామని మంత్రి వెల్లడించారు. ఫేక్ కాల్స్ విమాన ప్రయాణాలకు తీవ్ర విఘాతం కలిగిస్తున్న వారికి జైలు శిక్షతోపాటు జీవితాంతం విమానాల్లో ప్రయాణించే వీలు లేకుండా చట్టాన్ని సవరించాలని యోచిస్తున్నామని చెప్పారు. ఇందుకు భారత పౌరవిమానయాన చట్టం 1982కు సవరణలు ప్రతిపాదించామని, దీనిపై మంత్రివర్గ స్థాయిలో విస్తృత చర్చ జరుగుతోందని, అభిప్రాయ సేకరణ తర్వాత చర్యలు తీసుకుంటామన్నారు. పదేళ్ల కాలంలో దేశంలో విమానాశ్రయాల సంఖ్య 74 నుంచి 158కి పెరిగిందని, మరో 50 విమా నాశ్రయాల నిర్మాణానికి ప్రతిపాదిస్తున్నామని మంత్రి పేర్కొన్నారు. 'పెరుగుతున్న విమాన ప్రయాణికుల రద్దీకనుగుణంగా ప్రస్తుతం దేశంలో ఉన్న 800 విమానాలకు అదనంగా మరో 1,100 విమానాలు అందుబాటులోకి వచ్చే అవకాశముంది. మన విమానాశ్రయాలు ఈ ఏడాది అక్టోబర్‌లో 5.3 శాతం వృద్ధిని నమోదు చేశాయి. గత ఏడాది ఇదే నెలలో 1.26 కోట్ల మంది విమాన ప్రయాణం చేయగా, ఆ సంఖ్య ఈ ఏడాది అదే నెలలో 1.36 కోట్లుగా నమోదైంది'అని పేర్కొన్నారు. విమానాశ్రయాల్లో ప్రయాణికుల భద్రత, సులభతర ప్రయాణ ఏర్పాట్లు, అన్నిచోట్ల జాప్యాన్ని నివారించటమే ప్రధాన లక్ష్యంగా హైదరాబాద్ విమానాశ్రయంలో ఏర్పాటు చేసిన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత ఎయిర్‌పోర్టు ప్రిడిక్టివ్ ఆపరేషన్ సెంటర్ భారత విమానయాన రంగంలో ఓ మైలురాయి అని మంత్రి పేర్కొన్నారు.

# కలెక్టర్ల సమర్థతతోనే ప్రజలకు న్యాయం

(మొదటి పేజీ తరువాయి)

అమరావతి: "ప్రజలతో గౌరవంగా ఉండండి. వారు కూడా ప్రభుత్వంలో భాగస్వాములే. ప్రజలకు మన పనులు నచ్చేలా చేయాలి" అని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కలెక్టర్లను ఆదేశించారు. మానవత్వంతో ఆలోచించి పనిచేయాలని సూచించారు. కలెక్టర్ల సమర్థత వల్లే ప్రజలకు న్యాయం జరుగుతుందని తెలిపారు. "ప్రభుత్వం మంచి పాలసీలు తీసుకొచ్చినా, వాటిని మీరే అమలుచేయాలి. మనమంతా ప్రజలకు సేవకులుగా ఉందాం. పీపుల్ ఫస్ట్ అనేది మన నినాదం కావాలి" అని స్పష్టం చేశారు. బుధవారం సచివాలయంలో ప్రారంభమైన కలెక్టర్ల సదస్సులో ముఖ్యమంత్రి ప్రారంభోపన్యాసం చేశారు. జిల్లా కలెక్టర్లు, ఉన్నతాధికారులకు దిశా నిర్దేశం చేశారు. "రాష్ట్రంలో పరిస్థితి గాడిలో పడుతోంది. ఇప్పుడిప్పుడే చీకట్లు తొలగిపోతున్నాయి. గత ప్రభుత్వంలో ప్రజలు మాట్లాడటానికి భయపడేవారు. ఇప్పుడు స్వేచ్ఛగా అభిప్రాయాలు చెప్పే పరిస్థితి వచ్చింది. బయట ప్రజలు నవ్వుతూ ఉన్నారంటే ప్రభుత్వంపై నమ్మకం ఏర్పడినట్టే! దీనిని కొనసాగించేలా మన పాలన కొనసాగాలి" అని చంద్రబాబు అన్నారు. విధ్వంసం తర్వాత జరిగే పునర్నిర్మాణానికి అందరూ కష్టపడి పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. గత ప్రభుత్వంలో అధికారులకు కూడా ఒకటో తేదీన జీతాలు వచ్చేవి కాదని, ఈ ప్రభుత్వం వచ్చాక జీతాలు, పెన్షన్లు మొదటి తేదీనే ఇస్తున్నామన్నారు. "గత ఐదేళ్లలో ఏపీ బ్రాండ్‌ను దెబ్బతీశారు. పక్క రాష్ట్రాలకు వెళ్తే ఏపీ గురించి అవహేళన చేసే పరిస్థితికి దిగజార్చారు. ఈ ఆరు నెలల్లో మళ్లీ పెట్టుబడులు వస్తున్నాయి. మళ్లీ రాష్ట్రానికి బ్రాండ్ పెరుగుతోంది. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెసలో ఇంకా వేగం పెంచాలి. ఇందుకు కలెక్టర్లలో పోటీ వాతావరణం రావాలి. ఇన్నేళ్లలో తొలిసారి ఇబ్బందికర పరిస్థితులు చూస్తున్నాను. రూ.10లక్షల కోట్ల అప్పులు పేరుకుపోయాయి. రూ.లక్ష కోట్లకు పైగా బిల్లులు చెల్లించాల్సి ఉంది. మరోవైపు ఆదాయం లేదు. అభివృద్ధి జరిగితే సంపద వల్ల ఆదాయం వస్తుంది. పోనీ అప్పులు చేద్దామంటే ఎఫ్ఆర్‌బీఎం అనుమతించలేని దుస్థితి వచ్చింది" అని చంద్రబాబు అన్నారు. ఆయన ఇంకా ఏమన్నారంటే.."ప్రజల నుంచి వస్తున్న ఫిర్యాదుల్లో 60శాతం భూసంబంధిత అంశాలే ఉంటున్నాయి. మద్యం, ఇసుక మాఫియాలతో దోపిడీ చేశారు. దీన్నంతా సరిదిద్దుతున్నాం. అధికారంలోకి రాగానే 20 పాలసీలు ప్రకటించాం. 2047 విజన్ డాక్యుమెంట్ రూపొందించాం. కొత్త పాలసీల వల్ల రూ.4లక్షల కోట్ల పెట్టుబడులు, 4లక్షల మందికి ఉద్యోగాలు వస్తాయి. అమరావతి నిర్మాణానికి కేంద్రం రూ.15 వేలకోట్లు ఇచ్చింది. ఇతరత్రా రూపాల్లో రూ.11వేల కోట్లు సమీకరించాం. అమరావతికి ప్రారంభ దశలోనే రూ.50వేల కోట్లు అవసరం. 2027నాటికి పోలవరం ప్రాజెక్టు పూర్తిచేయడం లక్ష్యం. ప్రతినెలా 64 లక్షల మందికి ఇంటికి వెళ్లి పెన్షన్లు అందజేస్తున్నాం. సామాజిక పెన్షన్ల కోసమే ఏడాదికి రూ.33వేల కోట్లు ఖర్చు చేస్తున్నాం. దీపం-2 పథకం ద్వారా ఇప్పటికి 40వేల మందికి ఉచిత సిలిండర్లు అందజేశాం. త్వరలో 16347 పోస్టులతో డీఎస్సీ నోటిఫికేషన్ ప్రకటిస్తాం. వచ్చే ఏడాది బడులు తెరిచే నాటికి కొత్త టీచర్లు బడుల్లో ఉంటారు"

# బీజేపీ ఎంపీల వ్యాఖ్యలను తొలగించండి

(మొదటి పేజీ తరువాయి)

స్వయంగా కలిసిన రాహుల్ గాంధీ.. సభ సజావుగా జరిగేందుకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. రాహుల్ గాంధీకి హంగేరికి చెందిన బిలియనీర్ జార్జి సోరోసకు సంబంధాలు ఉన్నాయని బీజేపీ ఎంపీలు నిషికాంత్ దూబే, సంబిత్ పాత్రా డిసెంబరు 5న ఆరోపించారు. ఆ మరుసటి రోజున నిషికాంత్ దూబే లోక్‌సభలో మాట్లాడుతూ.. కాంగ్రెస్ హస్తం సోరోస్ చేతిలో ఉందని, అమెరికా ప్రభుత్వం, జార్జి సోరోస్ ఇచ్చే నిధులతో పని చేసే ఓసీసీఆర్‌పీ(ఆర్గనైజ్డ్ క్రైమ్ అండ్ కరప్షన్ రిపోర్టింగ్ ప్రాజెక్టు)తో కాంగ్రెసకు సంబంధాలు ఉన్నాయని ఆరోపించారు. భారత్ జోడో యాత్ర కోసం రాహుల్ గాంధీ.. సోరోస్ దగ్గర డబ్బు తీసుకున్నారా ? అని ప్రశ్నించారు. తీవ్ర దుమారం రేపిన ఈ వ్యాఖ్యలనే రికార్డుల నుంచి తొలగించాలని రాహుల్ కోరారు. అయితే, తాను చేసిన విజ్ఞప్తికి సభాపతి సానుకూలంగా స్పందించారని, తగిన చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారని స్పీకర్‌తో భేటీ అనంతరం రాహుల్ గాంధీ విలేకరులతో అన్నారు. అదానీ అంశంపై చర్చ జరగకూడదనే లక్ష్యంతో బీజేపీ ఎంపీలు తమపై నిరాధార ఆరోపణలు చేస్తున్నారని పేర్కొన్నారు.

**రాజ్‌నాథ్‌కు గులాబీ**

ఓవైపు అదానీ, మోదీ చిత్రాలు.. మరోవైపు 'అదానీ-మోదీ భాయ్ భాయ్' అనే మాటలు ముద్రించి ఉన్న సంచులతో మంగళవారం పార్లమెంట్ వద్ద నిరసన తెలియజేసిన ఇండియా కూటమి ఎంపీలు బుధవారం మరింత వినూత్నంగా తమ నిరసన తెలియజేశారు. పార్లమెంట్ భవనం ప్రవేశ ద్వారం వద్ద బీజేపీ ఎంపీలకు జాతీయ జెండా(త్రివర్ణ పతాకం ముద్రించిన కార్డులు), చిన్న గులాబీ పువ్వు ఇచ్చి స్వాగతిస్తూ సభ సజావుగా జరిగేందుకు సహకరించాలని కోరారు. ఇదే క్రమంలో కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌కు రాహుల్ గాంధీ జాతీయ జెండా, గులాబీ పువ్వు అందజేశారు. కానీ, రాజ్‌నాథ్ వాటిని స్వీకరించకుండానే ముందుకు వెళ్లిపోయారు. కాగా, ఎంతో మంది సామాన్యులకు జీవనాడి లాంటి ప్రభుత్వ రంగ బ్యాంకు(పీఎసబీ)లను మోదీ ప్రభుత్వం.. కొన్ని ధనిక, శక్తిమంతమైన సంస్థలకు ప్రైవేటు పెట్టుబడి సంస్థలుగా మార్చేసిందని రాహుల్ గాంధీ దుయ్యబట్టారు. బుధవారం అఖిల భారత బ్యాంకింగ్ అధికారుల సమాఖ్యకు చెందిన ప్రతినిధులతో రాహుల్ సమావేశమయ్యారు. అనంతరం 'ఎక్స్'లో ఈ మేరకు పోస్టు చేశారు. తన మోసపూరిత స్నేహితుల కోసం ప్రభుత్వ రంగ బ్యాంకులను అపరిమిత నిధుల వనరుగా చూడటాన్ని మోదీ ప్రభుత్వం ఇకనైనా నిలివేయాలని అన్నారు.

# ఓట్లను తొలగిస్తున్నారు

(మొదటి పేజీ తరువాయి)

దళితులు, ఎస్సీలు, పూర్వాంచల్‌కు చెందిన బలహీనవర్గాల ఓట్లను బీజేపీ పనిగట్టుకొని తొలగించేలా చేస్తోందని కేజ్రీవాల్ ఆరోపించారు. 'భారత పౌరులుగా ప్రజలకు ఉన్న ఓటు హక్కును బీజేపీ లాగేసుకుంటోంది.ఓటర్లను తొలగించడానికి బీజేపీ కార్యకర్తలకు దరఖాస్తు ఫారాలను అందించింది. చాలా నియోజకవర్గాల్లో ఇది జరుగుతోంది' అని కేజ్రీవాల్ అన్నారు. భారత పౌరులుగా ప్రజలకున్న హక్కులను బీజేపీ లాగేస్తోందని ఆరోపించారు. ఢిల్లీలో చాలా నియోజకవర్గాల్లో ఈ విధంగా ఓట్లను తొలగిస్తున్నారని ధ్వజమెత్తారు. ఓట్ల తొలగింపునకు సంబంధించి ఈసీకి మూడు వేల పేజీల ఆధారాలను సమర్పించామని కేజ్రీవాల్ తెలిపారు. భారీస్థాయిలో ఓట్ల తొలగింపు జరుగుతోందన్నారు. దీన్ని అడ్డుకోవాలని, ఓట్ల తొలగింపునకు దరఖాస్తు చేసిన వారిపై కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. షాహ్‌దారా నియోజకవర్గంలో ఒక బీజేపీ నాయకుడు ఏకంగా 11,008 ఓట్లను తొలగించాలని ఈసీకి ఒక జాబితాను సమర్పించారని, ఈసీ రహస్యంగా వీటిని తొలగించే పనిలో ఉందని ఆరోపించారు. పెద్ద ఎత్తున ఓట్ల తొలగింపు ఉండదని ఈసీ తమకు హామీ ఇచ్చిందని వెల్లడించారు. ఇప్పటివరకు తొలగించిన ఓట్లపై దృష్టి పెడతామని, బూత్‌స్థాయి అధికారితో విచారణ జరిపిస్తామని తెలిపిందన్నారు. ఢిల్లీ అసెంబ్లీకి వచ్చే ఏడాది ఫిబ్రవరిలో ఎన్నికలు జరగనున్న విషయం తెలిసిందే.

# ఎమ్మెల్యేకు ప్రజలు దూరం కావడానికి కారణం పీఏలు, పీఆర్వోలే

(మొదటి పేజీ తరువాయి)

సభలో ఎవరి పాత్ర వాళ్లు పోషించాలన్నారు.శాసనసభ వ్యవహారాలపై తెలంగాణ శాసనసభ, మండలి సభ్యులకు బుధ, గురువారాల్లో మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థలో శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా శాసన సభ వ్యవహారాల శాఖ మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ..'మొదటి సారి ఎన్నికైన శాసనసభ్యులు 57 మంది శాసన సభలో ఉన్నారు. శాసన సభ అందరిది.. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలో మరొక పార్టీదో కాదు. ఈ ట్రైనింగ్ సెషన్స్ కోసం అందరికీ ఆహ్వానం పంపించాము.పాత రోజుల్లో సిద్ధాంత పరంగా భేదాభిప్రాయాలు ఉన్నా సభలో ఎవరి పాత్ర వారు పోషించారు. నేను మొదటిసారి ఎన్నికైనప్పుడు కాంగ్రెస్ పార్టీ ప్రతిపక్షంలో ఉంది. నేను నాలుగోసారి సభలో ఉన్నప్పుడు పీఏసీని ప్రతిపక్షానికి ఇవ్వలేదు. ఎమ్మెల్యేలు అందరూ శాసనసభకు హాజరయ్యే సాంప్రదాయం కొనసాగించాలి. ఎమ్మెల్యేగా గెలిచి సభ రాకుండా దూరంగా ఉండకండి. పార్లమెంట్‌లో ఎలాగైతే ఉత్తమ పార్లమెంటేరియన్ ఇస్తున్నారో అదే విధంగా ఉత్తమ శాసనసభ వక్త అవార్డు ఇవ్వాలని స్పీకర్‌ను కోరుతున్నాం' అంటూ కామెంట్స్ చేశారు.స్పీకర్ గడ్డం ప్రసాద్ మాట్లాడుతూ..'చట్టాలను రూపొందించే హక్కు శాసన సభ్యులకు ఉంటుంది. గతంలో శాసనసభ సమావేశాలు ఉంటే సినిమా రిలీజ్ వాయిదా వేసుకునే వారు. ఎన్టీఆర్, వైఎస్ రాజశేఖర్ రెడ్డి లాంటి గొప్ప వ్యక్తులు బాగా మాట్లాడి మంచి పేరు తెచ్చుకున్నారు. ఉత్తమ పార్లమెంటేరియన్ మాదిరిగా ఉత్తమ శాసనసభ వక్త అవార్డు పరిశీలన చేస్తాం' అంటూ చెప్పుకొచ్చారు.తెలంగాణ శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి మాట్లాడుతూ..'గాలివాటం రాజకీయాలు ప్రారంభం అయినప్పటికీ కొత్త వాళ్ళు మళ్ళీ గెలవడం లేదు. మొదటిసారి ఎన్నికై రాజకీయాల్లో సక్సెస్ అయ్యే వారి శాతం 25శాతమే. కొందరు నాయకులు గెలిచాక ప్రజలతో మమేకం కావడం లేదు. ఎమ్మెల్యేకు కోటరీ వల్ల ప్రజలు స్వయంగా ఎమ్మెల్యేను కలిసే అవకాశం ఎక్కువగా ఉండదు. ఎమ్మెల్యేలు ప్రజలకు అందుబాటులో ఉండాలి.. ఫోన్లు ఎత్తాలి. నేను ఒకసారి ఓడిపోవడానికి నాకు సెక్యూరిటీ సమస్య వల్లే. ప్రజలు ఎమ్మెల్యేకు దూరం అవ్వడానికి కారణం పీఏలు, పీఆర్వోలు అంటూ కామెంట్స్ చేశారు.



# జర్నలిస్టులపై దాడికి పాల్పడిన మోహన్ బాబును అరెస్టు చేయాలి!

## జర్నలిస్టులకు రక్షణ కల్పించాలి!!

## టీయుడబ్లుజె(ఐ జేయు)

## ఆధ్వర్యంలో సంగారెడ్డిలో నిరసన

సంగారెడ్డి :హైదరాబాదులో జర్నలిస్టులపై దాడికి పాల్పడ్డ సినీ నటుడు మోహన్ బాబు అతని అనుచరులు భవనశాలపై కట్టని చర్యలు తీసుకోవాలని టీయూడబ్ల్యూజేఐజేయు సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు బందారు యాదగిరి డిమాండ్ చేశారు. తెలంగాణ స్టేట్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్టు రాష్ట్ర శాఖ పిలుపుమేరకు సంగారెడ్డి కలెక్టరేట్ వద్ద బుధవారం పెద్ద ఎత్తున జర్నలిస్టులు ధర్నా నిర్వహించారు. నల్ల బ్యాడ్జి లు ధరించి నిరసన తెలిపారు. తమ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్ అలీ, ఉపాధ్యక్షుడు ఎం ఏ కే ఫైజల్ అహ్మద్ పిలుపుమేరకు ఆందోళన చేపట్టామని జిల్లా అధ్యక్షుడు యాదగిరి వివరించారు.మోహన్ బాబు కుటుంబ తగాదాలు బయటికి వచ్చినప్పుడు మాత్రమే మీడియా అతని నివాస ప్రాంతానికి చేరుకున్నదని అన్నారు.మీడియాను నియంత్రించే హక్కు ,దాడి చేసే హక్కు మోహన్ బాబుకు గాని ఇతరులకు గాని లేనేలేదని ఆయన అన్నారు.ఇలాంటి దాడుల వల్ల జర్నలిస్టులను భయపెట్టాలని చూస్తే ..సహించేది లేదని పేర్కొన్నారు. విధి నిర్వహణలో ఉన్న టీవీ9 జర్నలిస్టు రంజిత్ టీవీ5 వీడియో జర్నలిస్టుపై మోహన్ బాబు దాడికి పాల్పడడం దుర్మార్గమని పేర్కొన్నారు సమాజ హితానికి పాటుపడుతున్న జర్నలిస్టులపై దాడికి పాల్పడడం ప్రతి ఒక్కరికి ఫ్యాషన్ గా మారిందని విమర్శించారు మీడియాతో మాట్లాడేటప్పుడు సంయమనంతో వ్యవహరించాల్సింది పోయి నోటి దురుసుతనంతో వ్యవహరించడం కాకుండా భౌతిక దాడులకు దిగడం క్షమించరానిదని అన్నారు ఇలాంటి దాడులు పున రావృతం కాకుండా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తక్షణమే మోహన్ బాబును, అతని అనుచరులను అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. జర్నలిస్టులకు తగిన రక్షణ కల్పించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి విష్ణు ప్రసాద్ మాట్లాడుతూ విచక్షణ కోల్పోయి వ్యవహరించిన మోహన్ బాబుపై ప్రభుత్వం తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని అన్నారు. వీధి రౌడీ లాగా ప్రవర్తించిన మోహన్ బాబును అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. యూనియన్ రాష్ట్ర శాఖ పిలుపుమేరకు అవసరమైతే రాష్ట్రవ్యాప్తంగా నిరసన చేపడుతామని హెచ్చరించారు. జర్నలిస్టుల ఐక్యత వర్ధిల్లాలి.. మోహన్ బాబును తక్షణమే అరెస్టు చేయాలి..జర్నలిస్టులకు రక్షణ కల్పించాలి ...అంటూ నినాదాలు చేశారు.ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా ఉపాధ్యక్షుడు మమ్మద్ సిద్ధిక్, సీనియర్ నాయకులు పానుగంటి కృష్ణ, బాల ప్రసాద్ యోగానంద రెడ్డి ,రాజేందర్ రెడ్డి, శ్రీనివాస్, మతిన్ ,డేవిడ్, దండు ప్రభు,నాగరాజు గౌడ్, సునీల్, శ్రీరామ్ శేఖర్, శ్రీనివాస్ , పుట్నాల లక్ష్మణ్,ఫోటో జర్నలిస్టుల సంఘం అధ్యక్షుడు ఆరి ఫ్, సంతోష్ హరి,శివ , కృష్ణ, పవన్ యూసుఫ్, ఆమేర్ ,దయానందం, మురళి, శ్రీకాంత్, సునీల్, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం డిఆర్ఓ కు వినతి పత్రం సమర్పించారు.





## మాజీ ఎమ్మెల్సీని పరామర్శించిన హరీశ్ రావు

**సంగారెడ్డి , (డైలీ రిపోర్ట్), డిసెంబర్ 11 :** కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న మాజీ ఎమ్మెల్సీ, టీఎస్పీఎస్సీ మాజీ సభ్యులు ఆర్. సత్యనారాయణను మాజీ మంత్రి హరీశ్ రావు పరామర్శించారు. బుధవారం నాడు సంగారెడ్డికి వచ్చిన ఆయన సత్యనారాయణ ఇంటికి వెళ్ళి పరామర్శించారు. సత్యనారాయణ ఆరోగ్య పరిస్థితి , అందిస్తున్న చికిత్స గురించి వారి కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. సత్యనారాయణ త్వరగా కోలుకోవాలని హరీశ్ రావు ఆకాంక్షించారు. ఈయన వెంట సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ తదితరులు ఉన్నారు. అనంతరం స్థానిక కలెక్టరేట్ తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాల వేసి అంజలి ఘటించారు. 2015 జూన్ 2న మంత్రి హోదాలో తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరించిన సందర్భాన్ని హరీశ్ రావు గుర్తు చేసుకున్నారు.

## పొన్నంను సన్మానించిన జి. శ్రీనివాస్




**సిద్ధిపేట , (డైలీ రిపోర్ట్) , డిసెంబర్ 11 :** రాష్ట్ర రవాణ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ను పట్టణ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు జి. శ్రీనివాస్ ఘనంగా సన్మానించారు. బుధవారం నాడు స్థానిక రేణుకా ఎల్లమ్మ దేవాలయంలో ఆయన అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రిని కలిసిన శ్రీనివాస్ ఆయనను శాలువాతో సత్కరించారు.

## ఆర్యవైశ్య మహాసభ కోశాధికారిగా నవీన్





**సిద్ధిపేట , (డైలీ రిపోర్ట్) , డిసెంబర్ 11 :** ఆర్యవైశ్య మహాసభ సిద్ధిపేట జిల్లా కోశాధికారిగా డాక్టర్ మాంకాల నవీన్ కుమార్ ను నియమిస్తూ మహాసభ జిల్లా అధ్యక్షుడు తణుకు ఆంజనేయులు ఉత్తర్వులు జారీ చేశారు. స్థానిక వీఎస్ఎస్ కన్వెన్షన్ హాల్ జరిగిన మహాసభ సమావేశంలో నియామక ఉత్తర్వులను నవీన్ కుమార్ కు అందజేశారు. ఈ సందర్భంగా మాంకాల నవీన్ కుమార్ మాట్లాడుతూ .. తన సేవలను గుర్తించి జిల్లా స్థాయి కీలక బాధ్యతలను అప్పగించిన జిల్లా అధ్యక్షుడు తణుకు ఆంజనేయులుకు కృతజ్ఞతలు తెలిపారు. పేద వైశ్యులకు సేవలందిస్తూ మహసభ బలోపేతానికి కృషి చేస్తానని చెప్పారు. ఆర్యవైశ్య మహాసభ జిల్లా కోశాధికారిగా నియమించడానికి సహకరించిన రాష్ట్ర నాయకులు గంప శ్రీనివాస్ , ఐత రత్నాకర్ , తడక లింగమూర్తి మాంకాల నాగరాణి తదితరులకు కృతజ్ఞతలు తెలిపారు.




## కీడలతో స్నేహభావం పెంపొందుతుంది: మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్

**శంకర్‌పల్లి డిసెంబర్ 11:(డైలీ రిపోర్ట్):** క్రీడా స్ఫూర్తిని పెంపొందించుకోవాలని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ అన్నారు. శంకర్‌పల్లి మున్సిపల్ పరిధిలో నిర్వహించిన సీఎం కప్ -2024 క్రీడ పోటీలు బుధవారం ముగిశాయి. కోకో, వాలీబాల్, కబడ్డీ క్రీడల్లో గెలిచిన వివిధ పాఠశాలల విద్యార్థిని, విద్యార్థులకు కమిషనర్, వైస్ చైర్మన్ వెంకట్రాంరెడ్డి బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడాకారుని విజయం వెనుక బాధాకరమైన కథ ఉంటుంది. క్రీడాకారుని ఓటమి వెనుక బాధాకరమైన ముగింపు ఉంటుందన్నారు. ఆటల్లో గెలుపు ఓటములు సహజమన్నారు. ప్రతీ క్రీడాకారుడు గెలుపుకోసం మైదానంలో అహర్నిశలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంఈఓ అక్బర్, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



## రెవెన్యూ ల సమస్యల పరిష్కారం కోసం ఐక్యంగా ఉందాం

**అనంతగిరి,డిసెంబర్11,(డైలీ రిపోర్ట్):** రెవెన్యూ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ఐక్యంగా ఉండాలని తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయిస్ యూనియన్ కొరకు కృషి చేస్తుందని ఆ సంఘం జిల్లా నాయకులు తహశీల్దార్ ఆంజనేయులు అన్నారు. బుధవారం కోదాడ, అనంతగిరి కార్యాలయాల్లో సంఘ సభ్యత్వ కార్యక్రమం ప్రారంభించి మాట్లాడారు... రెవెన్యూ ఉద్యోగులు తమ సమస్యల పరిష్కారానికి తెలంగాణ రెవెన్యూ ఉద్యోగులు సిద్ధంగా సిద్ధంగా ఉండాలన్నారు.. ఈ కార్యక్రమంలో తాహశీల్దార్ హిమబిందు, డిటి శ్రీధర్, జూనియర్ అసిస్టెంట్ లక్ష్మారెడ్డి, రమేష్, మంజుల, రాధిక, సరస్వతి, విక్రమ్ కుమార్, వీరన్న సునీత హరి మల్లేష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు..

# ఏపీలో గడిచిన ఐదేళ్లలో 8,30,986 మంది రైతులకు శిక్షణ

## ఐదేళ్లలో 2 వేల నూతన వంగడాల ఆవిష్కరణ.

## కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ మంత్రిత్వ శాఖ సహాయ మంత్రుల వెల్లడి.

## ఏలూరు ఎంపీ మహేష్ కుమార్ లోక్ సభలో అడిగిన ప్రశ్నలకు బదులిచ్చిన కేంద్ర మంత్రులు

**ఢిల్లీ/ ఏలూరు, డిసెంబరు 11:(డైలీ రిపోర్ట్):** గత ఐదేళ్లలో 8,30,986 మంది ఏపీకి చెందిన రైతులకు శిక్షణ ఇచ్చామని, 2 వేల నూతన వంగడాలను ఆవిష్కరించామని కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ మంత్రిత్వ శాఖ సహాయ మంత్రులు భగీరత్ చౌదరి, రామ్ నాథ్ ఠాగూర్ ప్రకటించారు. పార్లమెంట్ శీతాకాల సమావేశాల సందర్భంగా ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ లోక్ సభలో బుధవారం అడిగిన ప్రశ్నలకు మంత్రులు లిఖిత పూర్వకంగా సమాధానం ఇచ్చారు.ఐదేళ్లలో దేశంలోని రైతులకు నైపుణ్యాలు మెరుగు పరచడానికి అమలు చేస్తున్న పథకాలు, రైతులు, ముఖ్యంగా మహిళలు, యువతకు శిక్షణ ఇచ్చేందుకు ఎంత మొత్తం నిధులు ఖర్చు చేశారని పార్లమెంట్ శీతాకాల సమావేశాల సందర్భంగా ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ లోక్ సభలో అడిగిన ప్రశ్నకు కేంద్ర మంత్రి రామ్ నాథ్ ఠాగూర్ బదులిస్తూ అగ్రికల్చర్ టెక్నాలజీ మేనేజ్‌మెంట్ ఏజెన్సీ (%ూువీూ%) కేంద్ర ప్రాయోజిత పథకాన్ని వ్యవసాయ, రైతు సంక్షేమ మంత్రిత్వ శాఖ దేశవ్యాప్తంగా అమలు చేస్తుందని, అత్యాధునిక సాంకేతికత పట్ల అవగాహన కల్పించడానికి ఏపీలో మొత్తం 26 జిల్లాలతో సహా దేశంలోని 28 రాష్ట్రాలు, ఐదు కేంద్ర పాలిత ప్రాంతాల్లోని 739 జిల్లాల్లో అమలు చేస్తున్నట్లు తెలిపారు. గత ఐదేళ్లలో ఆత్మ పథకం ద్వారా 5,74,817 మంది రైతులకు శిక్షణ నిమిత్తం రూ.41.61 కోట్లు ఖర్చు చేశామని, కిసాన్ వికాస్ కేంద్రాల ద్వారా 2,35,514 ముందు రైతులకు శిక్షణ ఇచ్చేందుకు రూ.701.82 కోట్లు ఖర్చు చేశామని, స్కిల్ ట్రైనింగ్ ఆఫ్ రూరల్ యూత్ పథకం ద్వారా 2,317 మందికి, ఎస్ఎమ్ఏఎం పథకం ద్వారా 11,043 మంది, ఆర్కేవివై పథకం ద్వారా 165 మంది, స్కిల్ ట్రైనింగ్ ప్రోగ్రామ్ ద్వారా 686 మంది, పిఎంకేవివై ద్వారా 4,517 మందికి, కృషి శక్తి పథకం ద్వారా 1927 మంది చొప్పున ఏపీలో మొత్తం 8,30,986 మంది రైతులు శిక్షణ పొందారని, ఎన్ఆర్ఎల్ఎం పథకం ద్వారా 97 డ్రోన్లు అందజేసినట్లు మంత్రి తెలిపారు. భారత వ్యవసాయ పరిశోధన మండలి (ICAR) ఆధ్వర్యంలో కృషి విజ్ఞాన కేంద్రం (KVK) ద్వారా స్వయం ఉపాధిని ప్రోత్సహించడానికి ఏడు రోజుల స్వల్పకాలిక నైపుణ్య శిక్షణ అమలు చేస్తుందని, 2014-15లో "వ్యవసాయ యాంత్రీకరణపై ఉప మిషన్" (SMAM) పేరిట రూపొందించిన ప్రత్యేక పథకం ద్వారా దేశంలోని నాలుగు ఫార్మ్ మెషినరీ ట్రైనింగ్, టెస్టింగ్, ఇన్స్టిట్యూట్స్ నైపుణ్యాభివృద్ధిని పెంపొందిస్తున్నాయని, వ్యవసాయ, అనుబంధ రంగాల అభివృద్ధికి రాష్ట్రీయ కృషి వికాస్ యోజన (RKVY) అమలు చేస్తున్నట్లు మంత్రి బదులిచ్చారు.

మిషన్ ఫర్ ఇంటిగ్రేటెడ్ డెవలప్‌మెంట్ ఆఫ్ హార్టికల్చర్ (MIDH) కింద ఉద్యాన విభాగం యొక్క సమగ్ర వృద్ధికి సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (COE) సమగ్ర ప్రయోజిత పథకాన్ని కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తుందని, జూలై 2015లో స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ (MSDE) మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నేషనల్ స్కిల్



డెవలప్‌మెంట్ మిషన్‌ను ప్రారంభించిందని, దీని కింద DA&FW ఆమోదించబడిన అర్హత ప్రకారం గ్రామీణ యువత మరియు రైతులకు కనీసం 200 గంటల వ్యవధి గల నైపుణ్య శిక్షణా కోర్సులను నిర్వహిస్తోందని, వ్యవసాయం, అనుబంధ రంగాలలో అగ్రికల్చర్ స్కిల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (ASCI) చేపట్టే కార్యక్రమాలను ATMA నుంచి ఉపసంహరించినట్లు మంత్రి తెలిపారు.నైపుణ్యాభివృద్ధి, వ్యవస్థాపకత మంత్రిత్వ శాఖ (MSDE) ప్రధాన మంత్రి కౌశల్ వికాస్ యోజన (PMKVY) కింద వ్యవసాయం, అనుబంధ రంగాల కింద మహిళలు, యువతకు నైపుణ్య శిక్షణ అందిస్తోందని, గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ (MORD) జాతీయ గ్రామీణ జీవనోపాధి మిషన్ (NRLM) కింద డ్రోన్ అప్లికేషన్‌లపై స్వయం సహాయక సంఘాల మహిళలకు, రైతులకు శిక్షణ ఇస్తున్నామని మంత్రి సమాధానం ఇచ్చారు. ప్రతికూల వాతావరణ పరిస్థితులను తట్టుకునే నూతన వంగడాల అభివృద్ధికి పరిశోధనలు చేస్తుంటే గత ఐదేళ్లలో ప్రధాన పంటలకు సంబంధించి ఎలాంటి వంగడాలు ఉత్పత్తి చేస్తారని, పరిశోధనల నిమిత్తం మొత్తం ఎన్ని నిధులు కేటాయించారని ఎంపీ పుట్టా మహేష్ కుమార్ అడిగిన మరో ప్రశ్నకు కేంద్ర వ్యవసాయం, రైతు సంక్షేమం మంత్రిత్వ శాఖ సహాయ మంత్రి భగీరత్ చౌదరి బదులిచ్చారు.గత ఐదు సంవత్సరాలలో ఇప్పటి వరకు 372147.4 క్వింటాళ్ల ఉత్పత్తి లక్ష్యంతో 2000 వంగడాలను 60 వ్యవసాయ క్షేత్రాల్లో 542891.9 క్వింటాళ్ల బ్రీడర్ సీడ్ ఉత్పత్తి చేశామని, రైతుల ప్రయోజనాల కోసం గత ఐదేళ్లలో దేశవ్యాప్తంగా మొత్తం 2122.86 లక్షల క్వింటాళ్ల సర్టిఫైడ్ నాణ్యత కలిగిన విత్తనాలను పంపిణీ చేయగా, ఏపీలో గత ఐదేళ్లలో 786.6 క్వింటాళ్ల ఇండెంట్‌కు 1,930.4 క్వింటాళ్ల విత్తనాలు ఉత్పత్తి చేసినట్లు మంత్రి తెలిపారు.1840 వంగడాల్లో శీతోష్ణస్థితిని తట్టుకోగల 329 రకాలు కరువు, తేమ ఒత్తిడి, నీటి ఒత్తిడి సహనం, వరద నీటిలో మునిగిపోవడం, లవణీయత, క్షారత, సోడిక్, అధిక ఉష్ణోగ్రత సహనం, చలిని తట్టుకునేలా అభివృద్ధి చేశామని, 2019-20 నుండి 2023-24 వరకు బడ్జెట్ లో రూ. 3254.01 కోట్లు, ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.930.22 కోట్లు కేటాయించ్చినట్లు మంత్రి తెలిపారు. కేంద్ర, రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయాలు (SAU/CAU), ICARఇన్‌స్టిట్యూట్‌లతో సహా ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ (ICAR) ఆధ్వర్యంలో జాతీయ వ్యవసాయ పరిశోధనా వ్యవస్థ (NARS) నిరంతరం పరిశోధనలు చేస్తుందని, అధిక దిగుబడినిచ్చే, బయోటిక్, అబియోటిక్ మొత్తం 2000 రకాల వంగడాలను గత ఐదేళ్లలో విడుదల చేశామని వీటిలో 1840 వంగడాలు ప్రతికూల వాతావరణాన్ని తట్టుకుంటాయని మంత్రి బదులిచ్చారు. సీడ్ విలేజ్ కార్యక్రమం కింద తృణధాన్యాల పంపిణీకి 50 శాతం, వాతావరణ నిరోధక పంటల రకాలతో సహా పప్పు ధాన్యాలు, నూనె గింజలు, పచ్చి రొట్ట విత్తనాలు 60 శాతం రాయితీతో రైతులకు సరఫరా చేస్తున్నామని, 2011లో ప్రారంభించిన 'నేషనల్ ఇన్నోవేషన్స్ ఇన్ క్లైమేట్ రెసిలెంట్ అగ్రికల్చర్ (NICRA%), ఫ్లాగ్‌షిప్ నెట్‌వర్క్ ప్రాజెక్ట్, వాతావరణాన్ని తట్టుకునే వంగడాల సాంకేతిక ఆవిష్కరణలపై కూడా దృష్టి పెడుతుందని, ఈ ప్రాజెక్ట్ కింద క్లైమేట్ రెసిలెంట్ విలేజ్ (%జ=ఎ%) అభివృద్ధి చేయడంతో పాటు లొకేషన్ స్పెసిఫిక్ క్లైమేట్ రెసిలెంట్ టెక్నాలజీస్ (%జ=ు%లు) ఆధ్వర్యంలో 446 గ్రామాల్లో 2,13,421 క్షేత్రాల్లో 2,35,874 హెక్టార్ల విస్తీర్ణంలో నూతన వంగడాలు ఆవిష్కరిస్తున్నామని, నేషనల్ మిషన్ ఆన్ సస్టెయినబుల్ అగ్రికల్చర్ (%చీమీూ%) కింద అనేక పథకాలను అమలు చేస్తున్నట్లు మంత్రి పేర్కొన్నారు.

## జర్నలిస్ట్ లపై దాడిని ఖండించిన బెల్లంపల్లి జోర్నలిస్ట్ లు

**బెల్లంపల్లి డిసెంబర్ 11 (డైలీ రిపోర్ట్) :** హైదరాబాదులో జల్ పల్లి ఘటనలో జర్నలిస్టులపై సినీ నటుడు మోహన్ బాబు దాడి చేయడాన్ని నిరసిస్తూ బెల్లంపల్లి ఏసీపి రవికుమార్ కి జర్నలిస్టులు వినతి పత్రం అందజేశారు.వార్త కవరేజ్ కి వచ్చిన జర్నలిస్టుల పై దాడి చేయడాన్ని జర్నలిస్టులంతా తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు.ప్రభుత్వం వెంటనే చొరవ తీసుకొని మోహన్ బాబు పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని జర్నలిస్టులు డిమాండ్ చేశారు.లేని పక్షంలో రాష్ట్రవ్యాప్తంగా జర్నలిస్టులు పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని డిమాండ్ చేశారు.కార్యక్రమంలో పులియల రాజు , లక్ష్మణ్, వికాస్ యాదవ్, అనుదీప్ పటేల్ , శ్రీనివాస్ ముదిరాజ్,రాధాకృష్ణ రావు,రమేష్ వర్మ ,దాసరి తిరుపతి పటేల్,ఆకుల రాజేశం బోయ ,నగేష్ గౌడ్ పాల్గొన్నారు.



## జర్నలిస్టులపై దాడి చేసిన సినీ నటుడు మోహన్ బాబు పై చర్యలు తీసుకోవాలి

### అనంతగిరి ప్రెస్ క్లబ్ అధ్యక్షులు గరిడేపల్లి మురళి

**అనంతగిరి,డిసెంబర్11(డైలీ రిపోర్ట్):** హైదరాబాద్ నగరంలో న్యూస్ కవరేజ్ చేస్తున్న జర్నలిస్టులపై దాడి చేసిన సినీ నటుడు మంచు మోహన్ బాబు పై రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని అనంతగిరి ప్రెస్ క్లబ్ అధ్యక్షులు గరిడేపల్లి మురళి ప్రకటన ద్వారా డిమాండ్ చేశారు.ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియాపై రోజురోజుకు దాడులు పెరుగుతున్నాయని వీటిని ప్రభుత్వం సీరియస్ గా తీసుకొని మీడియాపై దాడులు చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు.జర్నలిస్టులు ప్రజల సమస్యలు వెలికితీస్తుంటే తట్టుకోలేని కొందరి వ్యక్తులు జర్నలిస్టులపై దాడులకు పాల్పడుతున్నారని తెలిపారు.ఇలాంటి వారి పట్ల ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుని జర్నలిస్టులపై దాడులు జరిగితే శిక్షలు కఠినంగా ఉంటాయని భయం వారిలో ఏర్పడే విధంగా చట్టాలు చేయాలని ఆయన కోరారు.



## పంచాయతీ నేతలకు పదవీగండం

### తలపట్టుకుంటున్న విలీన గ్రామాల నేతలు

### సర్పంచ్ నుంచి జడ్పీచైర్మన్ వరకు అన్నింటికీ దూరం

### వందలకొద్దీ తగ్గిన పదవులు.. అంధకారంలో రాజకీయ భవిష్యత్తు

### విలీనంతో భారీగా పెరుగనున్న రాజకీయ నిరుద్యోగం

హైదరాబాద్ : హైదరాబాద్ శివారు గ్రామాల విలీన ప్రక్రియ అన్ని పార్టీల నేతలను, కార్యకర్తలను కలవరపెతున్నది. గ్రామపంచాయతీ ఎన్నికల్లో పోటీచేసినవారే కాకుండా ఈసారి చాలామంది వార్డు మెంబర్లుగా, సర్పంచ్‌లుగా, ఎంపీటీసీలుగా, జడ్పీటీసీలుగా పోటీచేయాలని నిర్ణయించుకున్నారు. ఈ మేరకు ప్రణాళికలు రూపొందించుకుని కార్యాచరణను సిద్ధం చేసుకున్నారు. కానీ విలీనం వారి కలలను కల్లలు చేసింది. అన్ని వార్డుల్లో కార్యకర్తలు, నాయకులు వారి పార్టీల కోసం కష్టపడుతూ, కోరుకున్న పదవుల్లో గెలవడానికి సన్నద్ధమయ్యారు. ప్రధానంగా పదేండ్లపాటు ప్రతిపక్షంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ ప్రస్తుతం అధికారంలో ఉండడంతో ఆశావహుల సంఖ్య పెరిగింది. విలీన ప్రక్రియ వారి ఆశలపై నీళ్లు చల్లింది

ఔటర్ రింగ్‌రోడ్డు లోపలి గ్రామాలన్నీ మున్సిపాలిటీలో విలీనమయ్యాయి. ప్రస్తుతం గ్రామాల్లో ప్రత్యేక అధికారుల పాలన కొనసాగుతున్నది. జనవరిలో మున్సిపాలిటీల పాలన పూర్తవుతుంది. మరో ఏడాది పాటు ప్రత్యేక అధికారుల పాలనతో నడిపించి గ్రేటర్ పాలకవర్గం కాలపరిమితి ముగిసిన తర్వాత కార్పొరేషన్‌లో కలిపేసి ఎన్నికలకు సిద్ధం అవుతారన్న ప్రచారం జరుగుతున్నది. ప్రస్తుతం 150 డివిజన్లు కలిపి కోటి జనాభాతో జీహెచ్ఎంసీని ఏర్పాటు చేశారు. విలీన గ్రామాలకు సంబంధించి ఏడు కార్పొరేషన్లు, 30 మున్సిపాలిటీల్లో 60 లక్షల జనాభా నివాసం ఉంటోంది.వీటన్నింటినీ కలిపి హైదరాబాద్ సిటీ కార్పొరేషన్ ఏర్పాటైతే మొత్తం జనాభా 1.8 నుంచి 2 కోట్లకు చేరుకుంటుందని అంచనా. ప్రభుత్వ నిర్ణయం మేరకు సిటీ కార్పొరేషన్ ఏర్పాటైతే కౌన్సిలర్లు, చైర్మన్లు, డైరెక్టర్ల పదవులన్నీ కనుమరుగవుతాయి. వాటిస్థానంలో కార్పొరేటర్లు, మేయర్లు పాలనలోకి వస్తారు. దీంతో నేతల తలరాతలు మారనున్నాయి. ప్రస్తుతం 1200 ఓటర్లతో ఒక మున్సిపల్ వార్డ్, 300 ఓటర్లతో గ్రామ పంచాయతీ వార్డులు ఉండగా కార్పొరేషన్ ఏర్పాటైతే ఒక్కో డివిజన్ పరిధిలో సుమారు 30వేల నుంచి 40వేల మంది ఓటర్లు ఉండే అవకాశముంది.ఔటర్ రింగ్‌రోడ్డు చుట్టూ విలీనప్రక్రియలో భాగంగా పటాన్‌చెరు సెగ్మెంట్‌లోని పదకొండు గ్రామాలను తెల్లాపూర్, అమీన్‌పూర్ మున్సిపాలిటీల్లో కలిపింది. పటాన్‌చెరు, అమీన్‌పూర్ మండలాల పరిధిలో దాదాపు 200 మంది లీడర్లు సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో పోటీకి సన్నాహాలు చేసుకుంటూ ప్రజల్లోకి వెళ్లారు.

Printed And Published By Bakka Ravinder,on Behalf of Daily Report Publications And broadcasting News, Sangareddy Municipality, Ganesh Nagar HNo 3-11/ Sangareddy District Telangana state , Editor. B. shirisha print code TELTEL.2019/082422 , Cell 8501919707